నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం 31 మే 2024 | VIKARABAD

కేసీఆర్ పాలనలో ఎటు చూసినా పచ్చని చెట్లు.. ఆహ్లాదకరమైన వాతావరణం.. పరిశుభ్రమైన పరిసరాలతో చూడముచ్చటగా ఉన్న పల్లెల్లో నేడు ప్రగతి కళ తప్పింది. కాంగ్రెస్ సర్కార్ నిధులు విడుదల చేయకపోవడంతో 'పల్లె ప్రగతి' పడకేసింది. నిర్వహణ చేయలేక పంచాయతీ అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతుండడంతో ప్రభుత్వం బిడ్డుబాటు చర్యలకు దిగింది. పల్లె పాలనపై ప్రభుత్వం దృష్టి సారించింది. నిర్వహణలేక అస్తవ్యస్తంగా మారిన ప్రగతి పనుల లక్ష్యం నెరవేర్చేలా చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో పనుల ప్రగతిపై వాస్తవ పరిస్థితులను తెలుసుకుని నివేదిక అందించాలని అధికారులను పురమాయించింది. ఈ మేరకు అధికారుల బృందాలు గ్రామ పంచాయతీల్లో పర్యటించి ప్రస్తుత పరిస్థితిని ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నాయి. నిర్లక్ష్యం కనబర్చిన అధికారులకు షోకాజ్ నోటీసులను జారీ చేసి పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చేలా కార్యాచరణను రూపొందిస్తున్నారు. -రంగారెడ్డి, మే 30(నమస్తే తెలంగాణ)

బిడ్డుబాట

పల్లె ప్రగతి

- గత ఆరునెలలుగా నిర్వహణలేక అస్తవ్యస్తంగా మారిన ప్రగతి పనులు
- ప్రజల్లో వ్యతిరేకతతో చర్యలకు దిగిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రభుత్వ ఆదేశాలతో పల్లెబాట పట్టిన అధికారులు..
- క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రగతి పనులపై ఆరా.. ప్రభుత్వానికి నివేదన
- నిర్లక్ష్యం వహించిన ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

పల్లె కళ.. పగటి కల

ఆమనగల్లు మండలంలోని రాంనుంతాల గ్రామంలో పల్లె ప్రగతి పనులను పరిశీలిస్తున్న డీపీవో సురేశ్

పల్లెల్లో పచ్చదనం పెంచడానికి, ఆహ్లాద వాతావరణం కల్పించడానికి జిల్లాలోని 558 గ్రామ పంచాయతీల్లో కేసీఆర్ ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో పెద్ద ఎత్తున పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు తీర్చడానికి వైకుంఠధామాలను నిర్మించింది. పంచాయతీల ఆధ్వర్యంలో తడి, పొడి చెత్త విడిగా సేకరించి సేంద్రియ ఎరువు తయారీ కోసం సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. అలాగే గ్రామీణుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడానికి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ఎంతో సదాశయంతో చేపట్టిన ఈ అభివృద్ధి పనులు..కొత్త ప్రభుత్వంలో నిస్తేజంగా మారాయి. నిధుల కొరతతో నిర్వహణ సైతం అటకెక్కింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా చాలావరకు ప్రగతి నిర్మాణాలను ప్రజలు వినియోగించుకునే స్థితిలో లేవు. రూ.కోట్ల నిధులు వెచ్చించి నిర్మించిన నిర్మాణాలు నిరుపయోగంగా మారడంతో కాంగ్రెస్ ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. ప్రస్తుతం ఆయా నిర్మాణాలు ఏయే దశలో ఉన్నాయనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని మండల అభివృద్ధి అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఎంపీడీవోలు, కార్యదర్శులు పల్లె ప్రగతి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను రూపొందిస్తున్నారు. వైకుంఠధామాల్లో తాగునీరు, కరెంటు సౌకర్యాల పరిస్థితి ఏమిటి? పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలు ఎన్ని? ఎని బతికాయి అన్న విషయాలను పరిశీలించి ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. తడి, పొడి చెత్త సేకరణను విధిగా సేకరించేలా ఆదేశాలను జారీ చేస్తున్నారు. గత కొంతకాలంగా జిల్లాలో పనుల పరిశీలన కొనసాగుతుండగా డీపీవో సురేశ్, డీఎల్‌పీవోలు సైతం క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షిస్తున్నారు.

షోకాజ్ నోటీసులు జారీ..

జిల్లాలోని 558 గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పాలన ఈ ఏడాది జనవరితో ముగిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించక ప్రత్యేకాధికారులను నియమించి ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక పాలనను కొనసాగిస్తున్నది. 252 మంది గెజిటెడ్ అధికారులకు స్పెషల్ ఆఫీసర్లుగా బాధ్యతలు అప్పగించారు. ప్రత్యేక పాలనలో ప్రగతి పడకేసింది. పర్యవేక్షణ కొరవడి హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. మొక్కల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగినప్పటికీ వాటిని తొలగించే పరిస్థితి లేకుండాపోయింది. పారిశుధ్యం సైతం అస్తవ్యస్తంగా మారింది. ప్రస్తుతం జిల్లాలో కొనసాగుతున్న ప్రగతి పనుల సందర్భంగా నిర్లక్ష్యం వహించిన అధికారులపై జిల్లా అధికారులు చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఇప్పటివరకు ముగ్గురు ఎంపీడీవోలు, ఎనిమిది మంది గ్రామ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులను జారీ చేశారు.

నిర్వహణ లోపం ఉంటే చర్యలు తీసుకుంటున్నాం : సురేశ్, జిల్లా పంచాయతీ అధికారి

జిల్లాలో ఇప్పటివరకు ఎనభై శాతానికిపైగా గ్రామ పంచాయతీల్లో ప్రగతి పనుల పరిశీలన పూర్తయ్యింది. రెండు, మూడు రోజుల్లో అన్ని గ్రామ పంచాయతీల్లో పరిశీలన పూర్తవుతుంది. వాస్తవ పరిస్థితులను పరిశీలించి వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నాం. నిర్వహణ లోపాలు ఏమైనా ఉంటే గుర్తించి తగు చర్యలు తీసుకుంటున్నాం. నిర్లక్ష్యం కనబర్చిన ముగ్గురు ఎంపీడీవోలు, ఎనిమిది మంది గ్రామ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులను జారీ చేశాం.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

జూన్ 3 నుంచి బడిబాట.. జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మే 30(నమస్తే తెలంగాణ) : ప్రస్తుత విద్యా సంవత్సరంలో బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు జూన్ 3 నుంచి 11 వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న బడిబాట కార్యక్రమంలో అందరు భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక కోరారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జూన్ 3 నుంచి 11 వరకు చేపట్టనున్న బడిబాట, జూన్ 12 నుంచి 19 వరకు రోజువారీగా చేపట్టనున్న కార్యక్రమాలపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, తహసీల్దార్లు, ఎంపీపీలు, ఎంపీవోలు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులతోపాటు ప్రజాప్రతినిధులను, స్వయం సహాయక సంఘాలు, పంచాయతీ సెక్రటరీలు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలన్నారు. తమ పరిధిలోని గ్రామాలలో చదువుకు దూరంగా ఉంటున్న బడీడు పిల్లలను గుర్తించి దగ్గరలోని అంగన్‌వాడీలు, పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించి, ప్రభుత్వ పాఠశాలలే ఉత్తమమన్న నమ్మకాన్ని తల్లిదండ్రులలో కలిగించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులలో మౌలిక వసతులు కల్పిస్తూ డ్యూయల్ డెస్క్‌లు, డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు, శిక్షణ పొందిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్యపర్చాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు బుక్స్, యూనిఫాంలతోపాటు నాణ్యమైన భోజనం అందిస్తున్న విషయాన్ని సమగ్రంగా వివరించాలన్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుకున్న వారే ఉన్నత స్థానాలలో ఉన్నారన్న విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. జూన్ 3న బడిబాట కార్యక్రమంపై విలేజి ఆర్గనైజేషన్లతో సమావేశాలు ఏర్పాటు చేసి పిల్లల నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. 4న ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లలను గుర్తించాలన్నారు. 5 నుంచి 10 వరకు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి తలిదండ్రుల్లో చదువుపై అవగాహన కల్పించి పిల్లలను బడికి పంపేలా చూడాలన్నారు. 11న గ్రామ సభ ఏర్పాటు చేసి 3 నుంచి 10 వరకు చేపట్టిన కార్యక్రమాలపై చర్చించాలన్నారు. 12న పండుగ వాతావరణంలో పాఠశాలు పునః ప్రారంభించి నూతన విద్యార్థులకు స్వాగతం పలకాలన్నారు. 13న తొలిమెట్టు, 14న సామూహిక అక్షరాభ్యాసం, 15న గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్, 18న డిజిటల్ తరగతులపై అవగాహన, 19న ఆటలపోటీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఈవో సుశీందర్ రావు, డీఆర్డీఏ పీడీ శ్రీలత, వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు, డీపీవో సురేశ్ మోహన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో సమావేశమైన కలెక్టర్ శశాంక

పేరు మార్చి..నీరుగార్చి..

పనిచేసే ప్రాంతాల్లో వసతుల కరువు

అస్వస్థతకు గురైనా.. వడదెబ్బ తగిలినా అందుబాటులో లేని మెడికల్ కిట్లు

చౌడాపూర్ మండలంలోని అగ్రహారానికి చెందిన చంద్రయ్య అస్వస్థతతో మృతి

యాచారం మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన సత్తయ్యకు గాయాలు

ఉపాధి పనులు చేస్తుండగా తీవ్రంగా గాయపడిన సత్తయ్య

ఉపాధిపై ఉదాసీనత

కులకచర్ల/ యాచారం, మే 30 : గ్రామీణ నిరుపేదలకు ఏడాదికి వంద రోజుల పనిని కల్పించేందుకు ఉద్దేశించిన ఉపాధి హామీ పథకం అమల్లో అధికారుల ఉదాసీనతతో కూలీలు ఇబ్బంది పడు తున్నారు. కూలీలు పనిచేసే ప్రాంతాల్లో మౌలిక వసతులైన తాగునీరు, నీడ వసతి లేక అరిగోస పడుతున్నారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నా.. వాటిని సక్రమంగా ఖర్చు చేసి కార్యక్రమం సజావుగా సాగేలా చూ డాల్సిన బాధ్యత మాత్రం సంబంధిత గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులపైనే ఉం టుంది. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. ఎర్రటి ఎండలో పనిచేస్తున్న కూలీ లు సేద తీరేందుకు టెంట్లు లేకపోవడంతో నిలువ నీడ లేక చెట్ల కిందికి వెళ్తున్నారు. కూలీ గాయపడినా.. వడదెబ్బ తగిలి స్పృహ కోల్పోతే నిబంధనల ప్రకారం ఉండాల్సిన ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లూ అసలే అందుబాటులేవు. గురువారం వికారాబాద్ జిల్లా, చౌడాపూర్ మండలంలోని బంగ్రంపల్లి అనుబంధ గ్రామమైన అగ్రహారంలో రోజూ మాదిరిగానే ఉపా ధి హామీ పనికి వెళ్లిన బిచ్చపు చంద్రయ్య (58) అనే వ్యక్తి అస్వస్థతకు గురయ్యాడు. ఛాతీలో నొప్పి అంటూ కొద్ది దూరం వెళ్లి కుప్పకూలి కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందగా.... రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన పంబలి సత్తయ్య అనే వ్యక్తి రోజూ మాదిరిగానే ఉపాధి హామీ పనులకెళ్లాడు. అక్కడ పెద్ద రాయిని తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు అతడి కాలుపై ఆ రాయి పడడంతో తీవ్ర గాయమైంది. కాలు వేలు చితికిపోయింది. పని చేసే ప్రదేశంలో మెడికల్ కిట్ అందుబాటులో లేకపోవడంతో అతడికి చికిత్స ఆలస్యమై అధిక రక్తస్రావమైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య పేర్కొన్నాడు. కూలీలు పని చేసే ప్రాంతంలో తప్పనిసరిగా మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని.. సత్తయ్యకు దవాఖాన ఖర్చులతోపాటు నష్టపరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

గతేడాదితో పోలిస్తే 10 లక్షల మేర తగ్గిన హరితహారం లక్ష్యం

ఈ ఏడాది 40.53 లక్షల మొక్కలను నాటాలని అటవీశాఖ టార్గెట్

ప్రభుత్వ ఆదేశాలతో లక్ష్యం భారీగా తగ్గినట్లు సమాచారం..!

ఈ ఏడాది 29.33 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయం

తెలంగాణకు హరితహారం పేరును వనమహోత్సవంగా మార్చిన సర్కారు

వికారాబాద్ జిల్లాలోని 580 నర్సరీల్లో మొక్కలు సిద్ధం

డీఆర్‌డీఏ-డీపీవో ఆధ్వర్యంలో 18 లక్షల మొక్కలు నాటేందుకు నిర్ణయం

గతేడాది 39.69 లక్షల మొక్కలను నాటిన జిల్లా యంత్రాంగం

పచ్చదనం..పరిహాసం

వికారాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): ఆకుపచ్చని తెలంగాణగా మార్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెచ్చిన తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ఆనవాళ్లు లేకుండా చేస్తున్న రేవంత్ సర్కార్ తెలంగాణకు హరితహారం కార్యక్రమ పేరును వనమహోత్సవంగా మార్చడంతోపాటు ఈ ఏడాది వికారాబాద్ జిల్లాలో నాటాల్సిన మొక్కల లక్ష్యాన్ని కూడా భారీగా తగ్గించింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది సుమారు 10 లక్షల మొక్కల మేర లక్ష్యాన్ని తగ్గించడం గమనార్హం. మొదట ఈ ఏడాది 40.53 లక్షల మొక్కలను నాటాలని జిల్లా అటవీశాఖ అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించగా ప్రభుత్వ ఆదేశాల మేరకు టార్గెట్ తగ్గినట్లు సమాచా రం. పచ్చదనం పెంపే లక్ష్యంగా అమలు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంపై శీతకన్ను చూపడంపై జిల్లా అంతటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా గత ప్రభుత్వం మొక్కలను నాటడంతోపాటు సంరక్షణకు చర్యలు తీసుకోవడం, జియో ట్యాగింగ్ ప్ర క్రియ చేపట్టగా ఈ ఏడాది జియో ట్యాగింగ్ ప్రక్రియతోపాటు మొక్కల సంరక్షణకు సంబంధించి ఎలాంటి ప్రస్తావన లేకపోవడం గమనార్హం. అయితే 2024-25 ఆర్థి క సంవత్సరానికి 29.33 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా, గతేడాది 40.49 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకుని 39.69 లక్షల మొక్కలను నాటారు. జిల్లాలోని 580 నర్సరీల్లో మొ క్కలను పెంచి ప్రోగ్రామ్‌కు సిద్ధం చేస్తున్నారు.

పెరిగిన పచ్చదనం..

2015లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన తెలంగాణకు హరితహారం కార్యక్రమంతో వికారాబాద్ జిల్లాలో పచ్చదనం పెంపొందింది. ఏ గ్రామం, పల్లె చూసినా పచ్చదనంతో కళకళలాడుతున్నది. ఈ కార్యక్రమ ప్రారంభానికి ముందు జిల్లాలో 22శాతంగా ఉన్న పచ్చదనం ఎనిమిదేండ్లలో 26 శాతం మేర పెరిగినట్లు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో గ్రీనరీని పెంచేందుకు ప్రతి ఏటా అటవీ, గ్రామీణాభివృద్ధితోసహా పలు శాఖల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలను నాటారు. అంతేకాకుండా కొన్ని అటవీ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సీడ్‌బాల్స్ కూడా వేశారు. అటవీ ప్రాంతాల్లో ఉండే మొక్కలతోపాటు ఔష ధ మొక్కలనూ జిల్లా అటవీశాఖ యంత్రాంగం నాటింది. హరితహారం కార్యక్రమం తో పెరిగిన గ్రీనరీతో వర్షాలు కూడా సమృద్ధిగా కురిశాయి. అయితే జిల్లాలో తెలంగాణకు హరితహారంలో భాగంగా 2015-16లో 73.78 లక్షల మొక్కలు, 2016-17లో 1.39 కోట్ల మొక్కలు, 2017-18లో 71.04 లక్షలు, 2018-19లో 86.12 లక్షలు, 2019-20లో 1.02 కోట్లు, 2021-22లో 74 లక్షలు, 2022-23లో 40.25 లక్షలు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 39.60 లక్షల మొక్కలను జిల్లాలో నాటారు.

లక్ష్యం 29.33 లక్షల మొక్కలు..

వనమహోత్సవంలో భాగంగా వికారాబాద్ జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సర ంలో 29.33 లక్షల మొక్కలను నాటాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాన్ని పరిశీలిస్తే.. విద్యాశాఖ-11,000, పశుసంవర్ధకశాఖ-5,000, ఉద్యానవనశాఖ 2,00000, పరిశ్రమలశాఖ- 10,000, అటవీ శాఖ 3,50,000, డీపీవో-డీఆర్‌డీవో ఆధ్వర్యంలో 18,00,000, గనుల శాఖ 50,000, పౌరసరఫరాల శాఖ-2,000, ఎక్సైజ్ శాఖ-15,000, వ్యవసాయ శాఖ 2,50,000, మార్కెటింగ్‌శాఖ-500, పోలీస్ శాఖ 10,000, నీటిపారుదలశాఖ 5,000, రోడ్లు, భవనాల శాఖ 500, జిల్లా సంక్షేమాధికారి ఆధ్వర్యంలో 1000, తాండూరు మున్సిపాలిటీలో 60,000, వికారాబాద్ మున్సిపాలిటీలో 70 ,000, కొడంగల్ మున్సిపాలిటీలో 50,000, పరిగి మున్సిపాలిటీలో 43,000 మొక్కలను నాటాలని టార్గెట్‌గా పెట్టారు. అదేవిధంగా వనమహోత్సవంలో భాగంగా టేకు, ఉసిరి, జామ, నిమ్మ, సీతాఫల్, దానిమ్మ, మునగ, కానుగ, నెమలినార, శ్రీగంధం తదితర మొక్కలను నాటనున్నారు. అయితే ఇప్పటికే ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. అయితే గ్రామా ల్లో జామ, కరివేపాకు, దానిమ్మ, గులాబీ, మందారం, మల్లె మొక్కలతోపాటు వివి ధ రకాల మొక్కలను నాటనున్నారు. ఈ ఏడాది జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో పచ్చదనాన్ని మరింత పెంచేందుకు జిల్లా అటవీ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సా రించారు. అనంతగిరి అటవీ ప్రాంతంతోపాటు మిగతా అన్ని అటవీ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో ఔషధ మొక్కలను నాటనున్నారు. అయితే అటవీ శాఖ 14 నర్సరీల్లో 6,74,964 మొక్కలను సిద్ధం చేస్తున్నది.

రాజుతో కేక్ కట్ చేయిస్తున్న పారిశుధ్య సిబ్బంది

బాధ్యతగా నిలిచి.. స్వచ్ఛతగా మార్చి..

మియాపూర్ , మే 30 : తాను బాధ్యతగా ఉండటమే కాదు.. పది మంది ఆచరించేలా చేశారు ఆ కాలనీ వాసి. చెత్తకుప్పలు లేని కాలనీలే లక్ష్యమనే బల్లియా నినాదాన్ని తూచా తప్పకుండా పాటించి.. ప్రజలను చైతన్యవంతులను చేసి..చక్కటి ఫలితాన్ని సాధించారు. పరిమిత సంఖ్యలో నివాసాలుండే ఆ కాలనీలో ఏండ్ల తరబడి సమస్యగా మారిన వ్యర్థాల కుప్పలను శాశ్వతంగా నిర్మూలించగలిగారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని కొండాపూర్ డివిజన్ గపూర్ కాలనీ సంక్షేమ సంఘానికి చెందిన సభ్యుడు రాజు చిరు వ్యాపారి. 100కు పైగా గడపలున్న ఆ కాలనీలో సుమారు 1200 మంది వరకు ప్రజలు నివసిస్తున్నారు. అయితే కాలనీలో కొన్నేండ్లుగా మూడు ప్రాంతాల్లో నిత్యం చెత్త ఇతర వ్యర్థాలు పోగయ్యేవి. ఇటీవల వాటిని పూర్తి స్థాయిలో నిర్మూలించే లక్ష్యంతో జడ్‌సీ స్నేహ శబరీశ్ అధికారులతో కలిసి నిత్యం క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ..ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ నగేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డితో పాటు ఎస్ఆర్‌పీ, ఎస్ఎఫ్ఏ, పారిశుధ్య సిబ్బంది చెత్త పేరుకునే ప్రాంతాల నిర్మూలనపై పలు దఫాలుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం సభ్యులుగా రాజు.. ప్రతి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. తన వంతుగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని కాలనీవాసులకు అవగాహన కల్పించారు. వందకు పైగా ఇండ్లకు తిరిగి.. ప్రజలను చైతన్యవంతులను చేయడంలో ఆయన సఫలమయ్యారు. చివరికి కాలనీలోని చెత్త కుప్పల ప్రాంతాలను వ్యర్థ రహితంగా మార్చగలిగారు. రాజు కృషి ఫలితంగా.. ప్రసుత్తం గపూర్‌నగర్‌లో ఒక్క చెత్త కుప్ప కూడా కనిపించడం లేదు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛ ఆటోలకు వ్యర్థాలను అందిస్తూ.. ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాజు పుట్టినరోజు కావడంతో పారిశుధ్య సిబ్బంది.. వ్యర్థాలను పూర్తిస్థాయిలో నిర్మూలించిన ప్రాంతంలోనే ఆయనను సన్మానించారు. పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించి.. పది మందికి స్ఫూర్తి నింపే ప్రయత్నం చేశారు.

చెత్త రహిత కాలనీగా మార్చగలిగిన చిరు వ్యాపారి రాజు

పుట్టిన రోజున ఘనంగా సన్మానించిన పారిశుధ్య సిబ్బంది